ఊహ తెలిసిన నాటినుంచి వార్ధక్యం వరకూ ఆమె నిరీక్షణ దేనికోసం?

# నిరీక్షణ

గంటి రమాదేవి కథ

బయట వాన పడుతూ వుంది. మూడు రోజునుంచి అలా పడుతూనే వుంది. చినుకు చినుకుగా- ఒక్కోసారి భారీగా.

గాలికి ఊగుతున్న చెట్ల శబ్దం, నిరంతరంగా చూరునుంచి కారుతున్న వాన నీటి శబ్దం, దూరంగా గోదారి ఉరుముతున్నట్టుగా సాగిపోయే ప్రవాహ శబ్దం, భయం భయంగా వింటోంది అపర్ణ. ఆ రాత్రి అనంతంగా సాగుతున్నట్టుగా అనిపిస్తోంది. ఎప్పుడో చీకటి పడింది. ఇంకా తెల్లారదేం? తెల్లారినా మసక మసకగానే వుంటోంది - దట్టమైన మబ్బులవల్ల - పగలే చీకటి.

నాన్న వెళ్లిమూడురోజులయింది. ఇంకా రాలేదు. ఎడతెరిపిలేని వర్షం. పొంగే గోదారి. పడవలు నడుస్తున్నాయో లేదో -

''అమ్మా!'' పిలిచింది అపర్ణ. తల్లి లేవలేదు. కొంచెం గట్టిగా పిలిచింది.

''ఏం ఇంకా పడుకోలే!'' అడిగింది తల్లి సుబ్బలక్ష్మి.

''నిద్ర రావడంలేదు. భయంగా వుందమ్మా'' ఐదేళ్ల పిల్ల అపర్ణ. అపర్ణను దగ్గరగా తీసుకుని అంది తల్లి - ''భయం ఎందుకు తల్లీ''

''నాన్న రాలేదమ్మా - బయట గాలివాన'' ఏడుపు గొంతుతో అంది.

''వస్తారమ్మా - పడుకో'' అంది కానీ మనసంతా బరువుగా వుంది ఆవిడకూ. ''వరదొస్తే బెల్లం బుట్టలు తడిసిపోతాయా?'' అపర్ణ అడిగింది.

తేలు కుట్టినట్టు ఉలిక్కిపడిందావిడ.

''దానికి తట్టినది తనకు తట్టలేదు. గోదారొచ్చి ఊరుమీద పడితే, ఇల్లు వాకిళ్ల



మునిగిపోతాయి. చిక్కూమంటూ అటకలమీదే కూర్చోవాలి. అప్పుడు బెల్లం, బియ్యం, చింతపండు సమస్తం తడిసిపోతాయి.

ఆవిడ దిగ్గున లేచింది. సామాను గదిలో బెల్లం బుట్టలున్నాయి.

చిన్నగా వెలుగుతున్న కోడిగుడ్డు లాంతరు వత్తి పెద్దది చేసింది. బెల్లం బుట్టలున్న గదిలోకి వెడుతుంటే, అపర్ణ మెల్లిగా అంది ''తేళ్లుంటాయి

చూసుకో అమ్మా!''

గుమ్మంలో కాలుపెట్టబోయిన ఆవిడ కాలువెనక్కు తీసుకుని, దీపాన్ని నేల దగ్గరగా తెచ్చి చూసింది.

అరచెయ్యంత నల్లతేలు! భయంకరంగా కొండి ఎత్తి పెట్టుకుని వుంది.

''కోడి... కోడి...'' అంటూ పక్కనేవున్న రాయి దానిమీద పడేసింది.

బయట వాన శబ్దం నిరంతరంగా వినపడుతోంది. కొత్తగా గోదురుకప్పల బెకబెకమనే గోల మొదలయింది.

తాటాకు బుట్టలో వున్నాయి బెల్లపు అచ్చులు. చాలా బరువుగా వున్నాయి.

''అపర్ణా! పొద్దునే తీస్తానే - చాలా బరువు''

''వద్దమ్మా - ఇప్పుడే తియ్యి - నేల తడిగా వుంది - పాకం వచ్చేస్తుంది'' అపర్ణ అంది.

ఆ రాత్రి చాలా తొందరగా గడిచినట్టు అనిపించింది అపర్ణకు. తన చిన్న చిన్న చేతులతో బెల్లపు అచ్చులు తనూ మోసింది అటకమీదకు. తెల్లవారుజామున నిద్రపోయింది.

తెల్లవారింది. బాగా వెలుగు వచ్చిన తర్వాత మెలకువ వచ్చింది అపర్ణకు. బయటకు వచ్చి చూసింది.

వర్షం తుంపరగా పడుతోంది. నీటి గుంటల్లో కప్పలు సందడిగా తిరుగుతూ అరుస్తున్నాయి. గుడి దగ్గర ఎర్రటి నీరు - పిల్లలంతా ఆడుతున్నారు. ఆ నీటిలో వరద వచ్చేస్తోంది.

నాన్న ఇంకా రాలేదు.

దిగులుగా చూసింది పొంగుతున్న నీటికేసి. ఆడుతున్న పిల్లల్ని ఎవరో కేకలేశారు. వాళ్లు పారిపోయారు.

'తపా - తపా - శబ్దం చేసుకుంటూ, పూజారి శేషయ్యగారు వచ్చారు. ''రామ రామ్మా ఘోరం జరిగిపోయిందమ్మా - సుబ్బలక్ష్మి ఇలా రామ్మా - నీ భర్త నరసయ్య లేడూ'' అరుస్తూన్నాడాయన.

అపర్ణ గుండె గుభేల్మంది. సుబ్బలక్ష్మి పరుగెట్టుకుంటూ వచ్చింది. ''ఏమయింది?'' అడిగింది కంగారుగా.

శేషయ్యగారు నిట్టూర్చి అన్నారు ''పాత రేవులో రాత్రి పడవ దాటుతూ వుంటే, జనం కొట్టుకుపోయారు. మహా గోదారమ్మా, మహా ప్రవాహం దాంట్లో జనం పూచిక పుల్లల్లా కొట్టుకుపోయారు. రౌద్రంమీది వుంది గోదారి తల్లి...''

అపర్ణ కళ్లుమూసుకుని, ''దేముడా! మా నాన్నని బతికించు'' అని ప్రార్థించింది.

శేషయ్యగారు చెప్పడం ఆపలేదు. ''లంకలో సాయిబుగారికి సుస్తీ చేసింది. నరసయ్య బెల్లం బుట్టలు అక్కడే ఖరీదు చేస్తాడుకదా - గోదారి పొంగుతూ వుందని ఆయన్ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఎవరూ సాహసించలేదు. నరసయ్య డాక్టరును తీసుకుని రావడానికి బయలుదేరాడు. డాక్టరును బతిమాలి తీసుకువస్తుంటే చీకట్లో కొబ్బరిచెట్టుకు కొట్టుకుని పడవ తలక్రిందులయింది. నారాయణ నారాయణ ఎంతమంది బలి అయ్యారో''

''మా నాన్న'' అంది కంగారుగా అపర్ణ.

ఆయన అపర్ణను చేత్తో ఎత్తుకుని అపర్ణ ముఖంలోకి చూస్తూ అన్నాడు.

''మీ నాన్నకు భయం లేదమ్మా - కొబ్బరి చెట్టును పట్టుకుని రాత్రంతా వున్నాడు. ఇక వస్తూ వుంటాడు''

ఆయనకు తన చిన్న చేతులతో దండం పెట్టి

క్రిందకు దిగి బయటకు పరుగెత్తింది తండ్రికోసం నిరీక్షణ.

● ● ●

వానలు వెనకపెట్టాయి. ఉగ్రనరసింహమూర్తిలాటి గోదావరి బుద్ధ భగవానుడిలా శాంతరూపం దాల్చింది.

చీకటి అయ్యేసరికి భయపడిపోయేది అపర్ణ.

''పొద్దుపోకుండా రాలేవా నాన్నా?'' అడిగింది నరసయ్యను ఆమె.

నరసయ్య నవ్వుతూ అన్నాడు ''నా తల్లీ! ఇంట్లో నా గురించి నువ్వింత ప్రార్థన చేస్తూ వుంటే నాకేం భయమమ్మా!''

తండ్రిగురించి బెంగపడ్డ అపర్ణ తల్లిగురించి ఆలోచించేదికాదు. ఎప్పుడూ ఇంటిపట్టునే వుంటుందినా...

మళ్లీ మళ్లీ వానాకాలం వస్తూనే వుంది. నాలుగేళ్లకోసారి మళ్లీ వరద వచ్చింది.

నాలుగో తరగతిలోకి వచ్చిన అపర్ణకు, ఏదో లోపం గోచరించింది తల్లిలో. కళ్లకింద నల్లటి మచ్చలు, మాట నీరసంగా వస్తోంది. ఈ సాయంత్రం అమ్మ గురించి దేవుడ్ని వేడుకోవాలి'' అనుకుంది.

అయితే...

అప్పటికే సమయం మించిపోయినట్లుంది.


సాయంత్రం ఇంటికి రాగానే ఇంటి చుట్టూరా ఉన్న జనాన్ని బెరుకుగా చూసింది.

సుబ్బలక్ష్మిని బయట పడుకోబెట్టారు.

''ఏం మాయదారి జబ్బో - లోపల్లోపల తినేసింది - ఒక్కరోజూ చెప్పలేదు తను బాధపడుతున్నట్టు - తన బాధ తనలోనే ఇముడ్చుకుని భర్తకూ, పిల్లకూ వండిపెట్టేది'' గుంపులో ఎవరో అన్నారు.

''పాపం - నరసయ్య! సైకిలేసుకుని బెల్లం బుట్ట వెనక పెట్టుకుని, ఊరూరా వీధివీధి తిరిగితేగాని పూట గడవదు. పెళ్లాన్ని చూసుకోలేకపోయాడు''

''అదృష్టవంతురాలమ్మా! పసుపుకుంకుమలతో సుబ్బలక్ష్మి వెళ్లిపోయింది. అదృష్టవంతురాలు -



సుబ్బలక్ష్మి వెళ్లిపోయింది. అదృష్టవంతురాలు - నరసయ్యా! మరో టెక్కు, టక్కులాడిని పెళ్లాడుతాడు - మధ్యలో అన్యాయమైపోయేది ఈ పిల్లముండ అపర్ణేకదా''

అపర్ణకు ఏదో అర్థమయింది. ఏదో అనర్థం జరిగినట్టు అర్థమైంది. అమ్మ - తను చిన్నపిల్లనని చూడకుండా ''ఏమే! అపర్ణా'' అంటూ తన సలహా తీసుకునేది - తన జబ్బు విషయంలో తీసుకోలేదేం?

దుఃఖం వెల్లువలా ముంచుకొచ్చింది. ''అమ్మా!'' అని అరుస్తూ తల్లిమీద పడింది.

''లేమ్మా! లే! నీ కర్మ ఇట్లా కాలింది ఆ సవతి తల్లితో ఏ అవస్థలు పడాలో పిచ్చితల్లీ!'' ఎవరో అపర్ణను లేవదీశారు.

''నారాయణ నారాయణ'' అంటూ సుబ్బలక్ష్మి అంతిమయాత్ర సాగిపోయింది.

పదిరోజుల కర్మకాండ తరువాత వచ్చినవాళ్లంతా వెళ్లారు. స్కూలునుంచి వచ్చిన తర్వాత చేతనయిన వంట చేసి బిక్కుబిక్కుమంటూ వుండేది అపర్ణ. ఎవరి జీవయాత్రలో వారు వ్యవధిలేని పరిస్థితి.

ఒంటరి అపర్ణది దీర్ఘ నిరీక్షణ తండ్రి రాకకోసం.

అపర్ణ పుట్టినప్పుడువేసిన గంగాబొండాల కొబ్బరిచెట్టు, గునగునా ఎదిగింది. దానిప్రక్కన వేసిన పునాస మామిడి గుబురుగా పెరిగింది. మొగ్గతొడిగింది. కట్టవలో వేసిన గుత్తి సంపంగి విరగబూసి, గుప్పున సువాసనలు వెదజల్లింది. అపర్ణ విరగబూసిన మల్లెపొదలా కళకళలాడుతోంది.

నల్లటి వంకీల జుట్టు, నూనూగు మీసం, వచ్చీరాని గడ్డం కృష్ణమూర్తిది. పక్కింటి కృష్ణమూర్తి అపర్ణకు సాయంగా వుండేవాడు అప్పుడప్పుడు. శక్తి ఉడిగినా, నరసయ్య బెల్లపు బుట్ట సైకిలుమీద పెట్టుకుని ఊరూరా తిరగడం మానలేదు. జీవనభృతివలయంలో ఆదీలేదు అంతమూ లేదు. అదో గమ్యంలేని యాత్ర!

''ఒరే కృష్ణమూర్తీ - స్కూలు ఫైనలు పాసయాయవుగా! ఏం చేస్తావురా?'' అపర్ణ అడిగింది కృష్ణమూర్తిని.

''లారీ డ్రైవరు అవుతాను'' అన్నాడు కృష్ణమూర్తి.

''ఛఛ డ్రైవరివా ఏదైనా ఆఫీసులో ఉద్యోగం చూసుకోకూడదూ'' అంది అపర్ణ

''నువ్వూ చదివావుగా ఎనిమిదివరకూ నువ్వూ ఉద్యోగం చెయ్యచ్చుగా - అవును అన్నట్టు లారీ డ్రైవరును పెళ్లాడవా?'' అడిగాడు కృమూర్తి.

అపర్ణ బుగ్గలు ఒక్కసారి అరుణ వర్ణానికి తిరిగాయి. కృష్ణమూర్తి మాటల్లోని అంతరార్థం తెలియగానే -

పుట్టి, పెరిగి, కొద్దిరోజుల్లో ఎండిపోయే గడ్డిపూవు కాదు. భూమికి జానెడుగా వుంటూ, నెమ్మదిగా వేళ్లాని, కొమ్మలేసి, మానువేసి, పూతపూసే గున్నమావి లాటిది.

వారిద్దరి ఆ పల్లె ప్రేమ.

''ఒరే కృష్ణమూర్తీ'' అనడానికి నోరురాలేదు అపర్ణకు. కృష్ణమూర్తి ఏదో కొత్తగా కనిపిస్తున్నాడు అపర్ణకు. కృష్ణమూర్తి సహచర్యం తనకు జీవితాంతం వుండాలి''

''రేపే నేను బయలుదేరి గుంటూరు వెళ్లాలి. అక్కడ డ్రైవింగ్ నేర్చుకుని పనిలో ప్రవేశించాలి. ముందు క్లీనరుగా జీతం లేకుండా ఒక సంవత్సరం చెయ్యాలి. ఆ తర్వాత రేపు రేవుకు వస్తావా?''

కృష్ణమూర్తి గొంతులో విషాదపు జీర!

ఇద్దరి మనస్సుల్లో ఎడబాటు భావన బరువుగా వుంది.

కృష్ణమూర్తి అపర్ణ అరచెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు.

ఇదివరకు ఎన్నోసార్లు అపర్ణను ముట్టుకున్నాడు కృష్ణమూర్తి. ఏ భావమూ లేదప్పుడు.

ఇప్పుడు -

కన్నీటి వేడి చేతులమీద ఆమెను తడుపుతోంది. కరిగిస్తోంది.

"నాకోసం చూస్తూ వుండు - డ్రైవరు ఉద్యోగం ఖాయం కాగానే నిన్ను నాదాన్ని చేసుకుంటాను" అన్నాడు.

గబుక్కున తల ప్రక్కకి తిప్పి వెళ్లిపోయాడు.

మర్నాడు తెల్లవారుతుండగానే కృష్ణమూర్తి పడవ ఎక్కాడు. దూరంనుంచి చూసింది అపర్ణ. కృష్ణమూర్తి కళ్లు ఆమెను వెతుకుతూనే వున్నాయి. శాంత గోదారిలో పడవ మెల్లిగా కదిలింది. పడవ తెరచాపలో గాలి నిండగానే, చుక్కాని పట్టుకుని పడవ సరంగు కూనిరాగపు పాట మొదలుపెట్టాడు. చాలాసేపటివరకు ఆ పాట గాలిలో తేలుతూ అపర్ణ చెవులకు సోకుతూనే వుంది.

మరచిపోలేని ఆ పాట, గుండె నరాలను తెంపేసే అశ్రుగీతం. అలా కృష్ణమూర్తి వెళ్లిపోయాడు.

రోజూ ఏటి వడ్డుకు వెళ్లి చూసేది అపర్ణ. ఈ పడవలోనైనా దిగుతాడా కృష్ణమూర్తి-

అంతులేని నిరీక్షణ అది - ప్రేమికుడికోసం.

● ● ●

చలికి చిక్కిపోయిన గోదారి, వచ్చే వసంతం, గ్రీష్మాలకి భయపడుతూ చూస్తున్నవేళ! గహనాంతరాళాలనుండి అమృతపు బిందువులాంటి శీతల జల బిందువుకోసం సుదీర్ఘ నిరీక్షణ ప్రారంభించిన వేళ!!

సైకిళ్లమీద నలుగురు నరసయ్య ఇంటికి వచ్చారు. గ్లాస్కో పంచెలు, సిల్కు లాల్చీ వేసుకున్న

## వాయిదా

"నువ్వు ప్రతి పనిని వాయిదా వేస్తావని విన్నాను. నిజమేనా?"

"ఇంతకీ నీకీ విషయం ఎవరు చెప్పారు?"

"ఆ ప్రభాకరంగాడు!"

"వాడి సంగతి తర్వాత చెప్తా!"

"ఆ!!! ???"

- వాయిగండ్ల మురళీకృష్ణ (ఒంగోలు)



ఓ మనిషి బిడియపడుతూ లోపలకు వచ్చాడు. మిగిలినవాళ్లు, అతని భుజాలు రాసుకుంటూ వచ్చారు.

నరసయ్య కంగారుగా లోపలినుండి వచ్చాడు. ''అయ్యా! రండి రండి! ఈ చాపమీద కూర్చోండి! క్షమించండి - ఆడదిక్కులేని సంసారం ఇలా వుంది ఇల్లు''

''నరసయ్యా! ఇల్లు బాగానే వుంచిందయ్యా నీ కూతురు - ఏమైనా మా భద్రం అదృష్టవంతుడు'' వచ్చినవాళ్లలో ఒకడన్నాడు.

అపర్ణకు అర్థమైంది. తండ్రి తనకు పెళ్లి సంబంధం తెచ్చాడు.

''అమ్మా! అపర్ణ! చెరుకు పానకం, రొట్టెముక్కా తీసుకురామ్మా! పెళ్లివారు వచ్చారు''

అపర్ణ లిగరపు కంచాల్లో రాత్రి చేసిన రొట్టెముక్క చెరుకు పానకం తీసుకువచ్చి వాళ్లముందు పెట్టింది.

అవి తింటూ అన్నాడు వాళ్లలో అందరిలోకి పెద్దవాడుగా కనిపిస్తూన్నాయన.

''మా భద్రం పాలకొల్లులో ధాన్యం బ్రోకరు. రోజుకు లోటులేదు. ఖర్చులు పోను పావలా డబ్బులు మిగులుతాయి. పెళ్లానికి లోటు చెయ్యడు''

''మరి అబ్బాయికి అమ్మాయి''

''బంగారపు పళ్లెంలో కెంపులా వుంది అమ్మాయి భద్రం అదృష్టవంతుడు. ఇక నచ్చడాలు, గిచ్చడాలు అన్నీ తీసెయ్యి. ఇచ్చి పుచ్చుకోడాల్లోకూడా పట్టింపులేదు. ఇక వైశాఖంలో ముహూర్తాలున్నాయి'' అని దడదడలాడించేశాడా పెద్దమనిషి.

వాళ్లు వెళ్లిన తర్వాత అపర్ణ అంది. ''నాన్నా! నన్ను పంపించేస్తావా?'' నరసయ్య చెమ్మగిల్లిన కళ్లను వత్తుకుంటూ అన్నాడు ''నాకు తెలుసమ్మా నీ మనసు - కృష్ణమూర్తి లారీతోపాటు ఉత్తరదేశం వెళ్లాడుట. తిరిగి రాలేదు. ఆర్నెల్లయింది. వాళ్లింట్లో రోజా ఏడుస్తూనే వున్నారు. ఏమో ఆ భగవంతుడు ఎలా రాసేడో వాడికి - ఏమైపోయాడో ఏమో!!''

ఆ రాత్రంతా అపర్ణ కన్నీటి గోదారే అయింది.

పెళ్లిలో ఆమె కళ్లు కృష్ణమూర్తిని వెదుకుతూనే వున్నాయి.

● ● ●

పల్లె వదిలి పట్నం వచ్చింది అపర్ణ - కొబ్బరి కొట్లు, కాలువలు, పడవలు, ధాన్యం రవాణా, సినిమాహాళ్లు - దేవదాసు సినిమా చూసింది. మానిన గాయం మళ్లీ కలుక్కుంది. ఎక్కడున్నాడో కృష్ణమూర్తి ''ఉత్తరదేశంలో ఎక్కడున్నావ్? అసలు ఎందుకెళ్లావ్?'' కలుక్కుమనే ములుకులాటి ఆలోచనలు.

కాలవ వడ్డున ఒంటిగది పెంకుటిల్లు అద్దెకు తీసుకున్నాడు భద్రం.

కాలవ అవతల చాకలి గుడిసెలు, రాత్రంతా కుయ్యోమని ఏడిచే కుక్కలు.

''నాన్న ఏం చేస్తున్నాడో - ఊరూరా తిరిగి ఇంటికొస్తే నాలుగు మెతుకులు పెట్టే దిక్కులేదు'' మనసును క్రుంగదీస్తోంది ఆ ఆలోచన!

భద్రం ఇంటిలోంచి మధ్యాహ్నం వెళ్లేవాడు. ఏ అర్ధరాత్రో వచ్చేవాడు. పుల్లటి, తియ్యటి వాసన ఏమిటో తెలియలేదు మొదట్లో. తర్వాత ఎదురుగా వున్న చాకలామె చెప్పింది. ''నువ్వు చానా అదురుష్టబంతురాలివమ్మా - తాగేసి

గుట్టుచప్పుడు కాకుండా పడుకొనుంటాడు భద్రం అయ్యే - మా వాడు చావచితక తింటాడు''

తండ్రి వస్తే, ఆయన భయానికి ఈ అలవాటు మానటాడేమో!

ఒక కార్డు తెప్పించి ఉత్తరం రాసింది.

''నాన్నా! నువ్వు మా దగ్గరకొచ్చెయ్'' అని.

ప్రతిరోజూ ఎదురుచూసేది అపర్ణ ఇద్దరికోసం.

ఒకటి భద్రం - రెండు నరసయ్య.

అనంతమైన నిరీక్షణ అది.

● ● ●

మార్పునేదే జీవితం... కాలం గడచిపోతూ వుంటుంది. కొన్ని విషయాల్లో జీవితం అస్వాభావికమైనది. అదే మార్పులేని జీవితం.

అపర్ణ జీవితంలో మరో వ్యక్తికి స్థానం వచ్చింది. రవి... ఆమె తరం అంతరించకుండా ప్రకృతిచ్చిన ప్రసాదం. రవి పుట్టినప్పుడు వచ్చాడు నరసయ్య. మనవడి చేతికి అణా ఎత్తుబంగారపు ఉంగరం తొడిగాడు. ఆ తర్వాత ఏళ్లు గడిచినా రాలేదు.

భద్రం కొడుకును చూసుకుని మురిసిపోయాడు. వరుసగా కొన్ని నెలలు అపర్ణకు అతనికోసం నిరీక్షించే బాధ తప్పింది. ప్రతిరోజూ రాత్రి తొమ్మిది లోపలే ఇంటికి వచ్చేవాడు. కొడుకుతో ఆడుకోవడానికి. అదీ కొద్ది నెలలే-

సంవత్సరం గడిచి రవి పుట్టినరోజు పండుగ వస్తుందనుకునే టైములో పెద్ద జబ్బుచేసింది వాడికి.

భద్రం ఇంటి దగ్గరుండేవాడుకాదు. మూసిన కన్ను తెరవని రవిని రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా చూస్తూ వుండేది. భద్రం ఎప్పుడో వచ్చి మాటా మంతీ లేకుండా పడుకునేవాడు.

ఒక జబ్బు తగ్గితే మరో జబ్బు వచ్చేది రవికి. రాత్రంతా మెలకువగా వుండి ధర్మాసుపత్రి బెంచీమీద తన వంతు వచ్చేవరకు కునికి పాట్లు పడుతూ వుండేది. మార్పులేని జీవిత చక్రం తిరుగుతూనే వుంది.

## గాంధీజీ 'గీత' వేలం



ఫిలిప్స్ అనే వ్యక్తి లండన్‌లోని స్థానిక పత్రికల్లో 1898వ సంవత్సరానికి చెందిన భగవద్గీత (ఇంగ్లీషు అనువాదం) గ్రంథం వేల వేస్తున్నట్లు ప్రకటించాడు. అది మహాత్మాగాంధీ చదివిన గీత అనడంతో ముఖ్యంగా మన దేశంలో సంచలనం రేగింది. ఈ వార్త తెలిసిన వెంటనే హ్యూమన్ రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్ శాఖకు చెందిన జాయింట్ సెక్రటరీ అశోక్ బాజ్‌పేయ్ లండన్ వెళ్లి ఆ వేలంపాట ఆపుచేయించారు. గాంధీజీ ఉపయోగించిన ఆ భగవద్గీతను భారతదేశానికి తీసుకువచ్చి, సబర్మతి ఆశ్రమంలో పదిలపర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వినూత్న

రవి స్కూల్లో చేరాడు. గవర్నమెంట్ స్కూలు.

నరసయ్యకు జబ్బుచేసింది.

అపర్ణ తనింటికి తీసుకువచ్చింది. సింగినేలా నిద్రపోయినా, వీధీ వాడ నిద్రపోయినా నరసయ్యను కనిపెట్టుకుని వుండేది.

నరసయ్య మామూలుగా తిరగడానికి కొన్ని నెలలు పట్టింది.

రవి ఎలిమెంటరీ స్కూలునుండి మిడిల్‌స్కూలువరకు వచ్చాడు.

స్కూలువదిలిన తర్వాత ఇంటికి వచ్చేవాడుకాదు. రాత్రి ఎనిమిదయిపోయేది.

"బాబూ! రవీ! స్కూలువదిలి అందరూ ఇంటికొచ్చేస్తున్నారు మరీ రాత్రివరకు ఎదురుచూస్తున్నానురా" అంది అపర్ణ ఓరోజు.

"లైబ్రరీలో పుస్తకాలు చదువుకుంటానమ్మా. అవి కొనాలంటే ఖరీదు" అనేవాడు.

స్కూలువదిలి కాలేజీకి వచ్చేసరికి రవి రాకకోసం ఎక్కువసేపు ఎదురుచూపులు చూడాల్సి వచ్చేది. కొడుకుకోసం కన్నపేగు నిరీక్షణ అది.

"ఏం చాదస్తమమ్మా నీది ఎందుకు ఎదురుచూడడం - నేనేం చిన్నపిల్లాడినా" అనేవాడు.

"నా భయంనాది నాన్నా! తొందరగా ఇంటికొచ్చెయ్!"

రవి నవ్వుతూ అన్నాడు "నీ దగ్గరే కూచుంటే మన భవిష్యత్తు సంగతి. నేనుకూడా రైసుమిల్లు బ్రోకర్ని అవుతాను. అలా అయితే -"

అపర్ణ వింతగా చూసి అంది "ఏం చేస్తావురా మరీ - కలెక్టరవుతావా? జడ్జీవవుతావా - మన తాహతేమిటిరా"

"అవన్నీ పాతమాటలమ్మా! నేను అమెరికా వెడతాను - నిన్ను పాలరాతి ఇంట్లో వుంచుతా ఎండకి ఎండే, వానకి తడిసే కృశించే ఈ శరీరాన్ని ఎయిర్ కండిషన్డ్ భవంతిలో ప్రవేశపెడతా"

అయోమయంగా చూసింది అపర్ణ.

● ● ●

ప్రచండభానుడు వన్నెతగ్గి పశ్చిమదిక్కుగా ప్రయాణం సాగిస్తాడు.

కెంపులు పూసే చెక్కిళ్లు, వాడిన పూలుంచిన పళ్లెంలా తయారవుతుంది!

నల్లటి సిల్కుదారాల కురులు, తెల్లబడి వెలవెలా పోతాయి. అయినా మనిషి ఆశలో మార్పుండదు. మనిషి దృష్టిలో భవిష్యత్ అనంతం. దాంతోపాటు తనూ వుంటాడు ప్రయాణిస్తాడు - ఆశకాదు - అత్యాశ.

● ● ●

అపర్ణ కళ్లజోడు సవరించుకుంటూ, ఆకుపచ్చని ఆ కార్డు చేతిలోకి తీసుకుంది. రవి దగ్గరకు తీసుకువెళ్లే కార్డు అది. ఎంబార్కేషన్ కార్డ్ టు ఫ్రాంక్‌ఫర్ట్.

అపర్ణ, రవి దగ్గరకు వెడుతూ వుంది. రవి సహచరుడు ఒకడు తిరిగి వెడుతుంటే అతనితో వెడుతూ వుంది. భద్రం తను రానన్నాడు. కాంతులు విరజిమ్మే అంతర్జాతీయ విమానాశ్రయం ఆమెకో వింతలోకంలా వుంది.

ఒక కోనసీమ, కోనసీమనుండి ఇంకొక కొనసున్న సీమ అమెరికాకు ఆమె తొలిప్రయాణం.

రవి అన్నమాట అక్షరాలా చేశాడు. శ్రమించాడు. అమెరికా వెళ్లాడు. అందమైన

అమ్మాయిని పెళ్ళాడాడు.

బొంబాయినుంచి ఫ్రాంక్‌ఫర్ట్... అక్కడ నాలుగు గంటల విరామం తర్వాత ఫ్రాంక్‌ఫర్ట్‌నుంచి చికాగో-

''మామ్మగారూ! కూల్‌డ్రింక్ తాగుతారా! ఐస్‌క్రీమ్ తింటారా!'' అని నిమిషనిమిషానికి అడుగుతుంటే తల వద్దన్నట్టు ఆడించేది అపర్ణ.

ఇరవై నాలుగు గంటల తర్వాత రవి కారులో కూర్చున్న తర్వాతగాని ఆమె మనసు శాంతించలేదు. ఈ ఇరవైనాలుగు గంటలూ పూర్తికానట్టున్న నిరీక్షణతో ఆమె ఎంతో ఆందోళనకు గురైంది. తన ఫ్లాటులోకి వచ్చిన తర్వాత రవి అన్నాడు.

''ఇన్నాళ్లూ చాలా కష్టాలనుభవించావమ్మా! ఇక విశ్రాంతి తీసుకో - ఇక్కడ దేనికీ శ్రమపడక్కర్లేదు - అన్నిటికీ యంత్రాలున్నాయి''

అపర్ణ అలసటగా కింద కూర్చోబోతోంటే రవి కంగారుగా అన్నాడు.

''సోఫాలోనో, కుర్చీలోనో కూర్చో అమ్మా! క్రింద కూర్చోవడం అన్‌సివిలైజ్డ్''

● ● ●

రవి ఉదయం ఏడు గంటలకు భార్యతో సహా పనికి వెళ్లిపోతాడు. సరిగ్గా ఆరు పదిహేను నిమిషాలకు వచ్చేస్తాడు.

అతనికి గర్వంగా వుంది. ఆనందంగా వుంది.

పాలకొల్లు తప్ప మరే పట్నమూ చూడని తల్లిని చికాగో తీసుకువచ్చాడు. ఇక్కడున్న వింతలతో ఆమెను థ్రిల్ చేయాలి. ఆమె పడ్డ బాధలన్నీ మర్చిపోయేటట్టు చెయ్యాలి.

కానీ...


రవికి నిరాశే మిగిలింది.

అపర్ణ దేనిమీదా ఆసక్తి చూపలేదు. నిర్లిప్తత. రోదసిలో వుండే నిశ్శబ్ద నీరవత్వం.

మూడు వారాలకు ఆమెకు పెళ్లున జ్వరం వచ్చింది.

రవి కంగారు పడ్డాడు.

ట్రీట్‌మెంట్ జరుగుతుండగా డాక్టర్ చెప్పాడు ఆమెకు ఒంటరితనంవల్ల సంతోషం లేదని.



జ్వరం తగ్గిన తర్వాత అడిగాడు తల్లిని.

"ఒంటరితనంవల్ల బెంగపెట్టుకున్నావా?"

అపర్ణ లేదని తల తిప్పింది. చిన్నప్పటినుంచి గడిపిన జీవితం కళ్లముందు తిరిగింది.

తను ఒంటరిగానే పుట్టి పెరిగింది. ఏడేళ్లకే తల్లి పోయింది. మరీ ఒంటరితనం - కృష్ణమూర్తి వెళ్లిపోవడం భద్రంతో పెళ్లి - రాత్రి ఎప్పుడో వచ్చి అతను నిద్రపోవడం - రవి చదువు - ఒంటరితనం తప్ప ఏమీ లేదు. ఇదేం కొత్తకాదు" అదే చెప్పింది రవితో.

అపర్ణకు జ్వరం తగ్గినా ఆరోగ్యం కుదుటపడలేదు.

మనిషి మరీ క్రుంగిపోయింది. తిండి తినదు. ఒకటే నిద్ర!

రవి సైకియాట్రిస్ట్‌కు చూపించాడు. ఏవో అర్థంలేని థియరీలు చెప్పి తన ఫీజు తీసుకుని వెళ్లిపోయాడు.

బెంగా? ఎవరిగురించి? అపర్ణను తిరిగి తీసుకొచ్చెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

తిరిగి వచ్చినా ఆమెలో మార్పులేదు. ఆరోగ్యం క్షీణిస్తోంది. మందులు పుష్కలంగా వున్నాయి. డాక్టర్లు బోలెడు మంది - డబ్బుకు లోటులేదు. ఏముంది ఆమెకు... ట్రీట్‌మెంట్‌కు రెస్పాన్స్ లేదు.

రవి సెలవు అయిపోవచ్చింది. తల్లిని అలాగే వదిలి వెళ్లబుద్ధికాలేదు. నాలుగు రోజుల్లో ప్రయాణం.

రాత్రి సరిగా నిద్రలేదు. అటు కల్పవృక్షంలాంటి ఉద్యోగం... ఇటు మాడిపోతున్న అశ్వత్థ వృక్షంలా తల్లి.

తెల్లవారుజామున నిద్రపట్టింది.

కల... కలలో గజిబిజిగా ఒక ఆలోచన...

గబుక్కున లేచి కూచున్నాడు.

ఆలోచనలు చిందరవందరగా... ఆరోజంతా అన్యమనస్కంగా వున్నాడు. తల్లి అనారోగ్యానికి కారణం శారీరకంకాదు... అది చూచాయగా తెలుస్తోంది. ఆమె కుదుటపడాలంటే అలా చెయ్యాలి - అదీ బాధాకరమైనా తప్పదు.

ఆ సాయంత్రం అపర్ణను ట్రీట్ చేస్తున్న డాక్టర్ దగ్గరకు వెళ్లి తన ఆలోచన చెప్పాడు.

తెల్లవారకుండానే తన సామాను తీసుకుని తల్లికి చెప్పకుండా ప్రయాణమై వెళ్లిపోయాడు.

ఉదయాన్నే డాక్టరు వచ్చాడు.

''సారీ అపర్ణమ్మగారూ! రవి రాత్రే వెళ్లిపోయాడు. అర్జంటుగా టెలిఫోను వచ్చింది. మీకు చెప్పడం కుదరలేదు.''

అపర్ణకు ఆ మాటలు తూటాల్లా తగిలాయి.

''మళ్లీ ఎప్పుడు వస్తాడు?''

''ఏమో! ఇప్పుడు పాత ఊరులో వున్నాడో లేదో తెలియదు. అసలు అమెరికాలో వున్నాడో! ఇంకో దేశం వెళ్లిపోయాడో - వెళ్లాక ఉత్తరం రాస్తానన్నాడు''

అపర్ణ కాంతిలేని కళ్లల్లో కన్నీటి సముద్రం... ఒక్కగానొక్క కొడుకురవి - చెప్పకుండా వెళ్లిపోయాడు.

అప్పటినుంచే ఆమె కళ్లు వీధిగుమ్మంవైపే - కొడుకు రాసే ఉత్తరం కోసం నిరీక్షణ... డాక్టరు బయటకు వెడుతూ వుంటే రవి మాటలు గుర్తుకొచ్చాయి. ''అమ్మ చిన్నప్పట్నించీ టెన్షన్‌లో బతికింది. ఎప్పుడో ఒకరి గురించి ఆమె వర్రీ అవుతూనే వుండేది. ఆమెకు అట్టి పరిస్థితుల్లో అనారోగ్యం కలగలేదు. చీకూ చింతాలేని సమయంలో ఆమె ఆరోగ్యపరిస్థితి మారిపోయింది. ఆ రెంటినీ పరిశీలిస్తే ఆమె ఆరోగ్యానికి, ఈ నిరీక్షణకీ ఏదో ఇంటిమేట్ రిలేషన్ ఉన్నట్టుంది. అందుకే అటువంటి పరిస్థితి కల్పించి వెళ్లిపోతున్నాను. మళ్లీ పదిరోజుల్లో మీకు ఫోన్ చేస్తాను... నేను కర్కోటకుడ్ని డాక్టర్... ఇలా చేయక తప్పడంలేదు''

మంచం దిగి వచ్చి అపర్ణ గుమ్మం దగ్గరే కూర్చుంది నీరసంగా.

''రవి ఎనాలిసిస్ ఆఫ్ అపర్ణ - కరెక్టా కాదా'' అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

ఈ లోపల -

అపర్ణ నిరీక్షణ కొడుకుకోసం... కన్నూ, మనసూ ఒకటై... దానికోసమే బ్రతుకుతున్నట్టుంది ఆమె. చిత్ర నిరీక్షణ. అతనురాసే ఉత్తరం కోసం నిరీక్షణ.

## ముద్దు

''ముద్దుపెట్టుకున్నప్పుడు మీ ఆవిడని ఎందుకు కొరికావు?'' అడిగాడు డాక్టర్.

''ఆ విషయం మీకెలా తెలుసు?'' అనుమానంగా అడిగాడు వంశీ.

''ఇప్పుడే మీ ఆవిడ వచ్చి కుక్క కరిస్తే ఇచ్చే ఇంజక్షన్ చేయించుకుని వెళ్లిందిలే...'' చెప్పాడు డాక్టర్.

- పి.వి. మురళీకృష్ణ (హైదరాబాద్)

